క్లుప్తంగా

24న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను ఈ నెల 24వ తేదీన లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్వీఎస్ఎస్ మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద హుండీలను కూడా లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

20న కనకదుర్గమ్మకు సారె

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారికి శనివారం సారె సమర్పించనున్నట్లు ఈఓ ఎస్వీఎస్ఎస్ మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆషాఢమాసం శాకంబరీ ఉత్సవాలను పురస్కరించుకుని సారె సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ


మోటారు మరమ్మతును పర్యవేక్షిస్తున్న సర్పంచ్

శ్రీకాళహస్తి: మండలంలోని రామాపురంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం సర్పంచ్ పుట్టంరెడ్డి బాలిరెడ్డి పర్యవేక్షించారు. ఎస్టీకాలనీలో పాడైన మోటారును మరమ్మతు చేయించారు. అలాగే అంటు వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ మొత్తం పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీరు, నీడ, సౌకర్యాలు కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద నీరు, నీడ తదితర సౌకర్యాలతోపాటు, ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని ఏపీఓ భానుప్రియ సిబ్బందిని ఆదేశించారు. ఆమె మంగళవారం పల్లమాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరును పరిశీలించి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.272 కూలి వస్తుందని, కూలీల టార్గెట్ ప్రకారం కూలి తగ్గకుండా చూడాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు


ముళ్లపొదలను తొలగిస్తున్న కూలీలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు ఎస్సీ కాలనీలో మంగళవారం సర్పంచ్ తాతేకాల్వ మోహనరెడ్డి ఆధ్వర్యంలో ముళ్లపొదలను తొలగించారు. ఎస్సీ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. దీంతో ఎస్సీ కాలనీలో ముళ్లపొదలను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపరిశుభ్రతతో దోమలు చేరి, విష జ్వరాలు, డయేరియా తదితర రోగాలు ప్రబలే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవిందయ్య పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని భరద్వాజ తీర్థం గంగాసదన్ వద్ద సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల వికాస్ కేంద్రాల అధ్యాపకుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రాంత్ ప్రముఖ్ విజయలక్ష్మి, కొండారెడ్డి, నాగరాజు, జయచంద్రారెడ్డి, సూర్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

ఏర్పేడు: మండలంలోని మూలకండ్రిగలో ఓ బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి రిమాండ్ విధించినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. మూలకండ్రిగ గ్రామానికి చెందిన బలరామయ్య అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై ఈ నెల 7వ తేదీన లైంగికదాడికి పాల్పడ్డాడని చెప్పారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, సోమవారం చిత్తూరు కోర్టులో హాజరుపరిచగా 14 రోజులు కోర్టు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

రోడ్లు, కల్వర్టులు సకాలంలో పూర్తి చేయండి

నారాయణవనం: నియోజవర్గంలోని దెబ్బతిన్న ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు, కల్వర్ట్‌ల మరమ్మతుకు పూర్తి సహకారాన్ని అందించి, సకాలంలో పూర్తి చేయించాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. మంగళవారం సాయంత్రం తిరుపతిలో ఇంజినీరింగ్ డివిజనల్ కార్యాలయంలో పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల ఉన్నత అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్ధాతరంగా ఆగిపోయిన, అధ్వాన స్థితిలో ఉన్న 32 రోడ్ల పనులతో పాటు దెబ్బతిన్న ఆరు కల్వర్ట్‌లు, కాజ్‌వేల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

సత్యవేడు: వంటపాత్రలు శుభ్రం చేసే స్థలంలో మూత లేని కొళాయి



వరదయ్యపాళెం: హాస్టల్ లోపల ఆహార వ్యర్థాలు పడి ఉన్న దృశ్యం, ఏర్పేడు: హాస్టల్‌లోని హాలు





సంక్షేమమా..నువ్వెక్కడ..?

భవిష్యత్‌కు బాటలు వేసుకునేందుకు వచ్చిన బాలలు వారు. అమ్మానాన్నలకు దూరంగా ఉంటున్న నిరుపేద విద్యార్థులు వారు. వసతి గృహాలే వారికి ఆదరువు. అయితే కనీస వసతుల లేమి.. ఇరుకు గదులు.. అపరిశుభ్రత.. నాణ్యత లేని ఆహారం.. దోమల బెడద.. మరుగుదొడ్లు, నీటివసతి లేమితో కునారిల్లుతున్నారు. సంక్షేమం కరువై.. ఆదరణ బరువై బతుకు భారంగా గడుపుతున్నారు. ఇదీ ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితి.

- ప్రభుత్వ హాస్టళ్లలో కరువైన సౌకర్యాలు
- ఆహార నాణ్యత అంతంతమాత్రమే
- నరకానికి నకళ్లుగా మారిన వసతి గృహాలు


వరదయ్యపాళెం: అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు



వరదయ్యపాళెంలోని బాలుర వసతి గృహం

ఆర్వో.. నిరుపయోగం

సత్యవేడు: సత్యవేడు బాలికల అంబేడ్కర్ గురుకుల బాలికలు పాఠశాల, కళాశాలను మంగళవారం సాక్షి ఇద్దరు వీఆర్వోల సమక్షంలో పరిశీలించింది. గురుకులంలో ఆర్వో ప్లాంట్ పాడైపోయి నిరుపయోగంగా ఉంది. కొళాయి కప్పు లేదు. దీంతో నీరు వృదాగా పోతోంది. కొత్త విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు ఇంకా ఇవ్వలేదు. దీంతో ఇతర విద్యార్థుల ప్లేట్లు గ్లాసులు వాడుతున్నారు.

చన్నీళ్ల స్నానం..దోమలతో సహవాసం

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో పరిశుభ్రత నామమాత్రంగా మారింది. 72 మంది విద్యార్థులున్న ఈ వసతి గృహంలో విద్యార్థులు చన్నీళ్ల స్నానంతో ఇబ్బందిపడుతున్నారు. అలాగే గదుల పక్కనే తిని పడేసిన వ్యర్థాలు ఉండడంతో ఆ ప్రాంతంలో దోమలు వృద్ధి చెంది చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక దుర్వాసన వెదజల్లుతోంది. వంటగదిలో సైతం పాత్రలు శుభ్రం చేసే ప్రాంతంలోనే వంటలు చేయడం, చేసిన వంటలను అక్కడే ఉంచుతున్నారు. ఫలితంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.




రేణిగుంట: విద్యార్థుల కోసం వండిన నాణ్యత లేని చికెన్ కూర, సత్యవేడులో నాణ్యత లేని బియ్యం

రెగ్యులర్ వార్డెన్ కరువు


రేణిగుంట బీసీ బాలుర వసతిగృహం

రేణిగుంట: బీసీ బాలుర వసతి గృహంలో 65మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఈ హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్ లేరు. తిరుపతిలో పనిచేస్తున్న వార్డెన్ చైతన్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో పర్యవేక్షణ కొరవడింది. హాస్టల్‌లో ఉన్న 65 మందిలో మంగళవారం సాయంత్రం 25 మంది కూడా లేరు. బుధవారం సెలవు కావడంతో సొంతూళ్లకు వెళ్లినట్లు అక్కడి సిబ్బంది చెబుతున్నారు. వంట సిబ్బంది ఒక్కరే ఉన్నారు. వంటగది ప్రాంగణమంతా అపరిశుభ్రంగా ఉంది. గదుల్లో విద్యుత్ స్విచ్‌బోర్డులు పాడై ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్ల తలుపులు ఊడిపోయి నిరుపయోగంగా ఉన్నాయి.

రక్షణ లేమి..


బుచ్చినాయుడుకండ్రిగ: భోజనం చేస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలో ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల, బీసీ బాలుర హాస్టళ్లలో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ బాలుర హాస్టల్‌లో కొన్ని గదులకు తలుపులు, కిటికీలు విరిగిపోవడంతో విద్యార్థులు దోమ కాటుకు గురవుతున్నారు. వాచ్‌మెన్ లేక పోవడంతో రక్షణ కరువైంది. బీసీ హాస్టల్‌లో పదేళ్ల మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. దీంతో విద్యార్థులు మరుగుదొడ్ల కొరతతో ఇబ్బంది పడుతున్నారు. ఎస్సీ బాలికల హాస్టల్ పాఠశాల ఊరికి దూరంగా ఉండడంతో రాత్రి వేళల్లో బాలికలు భయాందోళనకు గురవుతున్నారు. మూడు హాస్టళ్లలోను ఆర్వో ప్లాంట్లు లేకపోవడంతో బోరు మోటారు నీటిని కాచి, చల్లార్చి తాగుతున్నారు.

రాజ్యమేలుతున్న అపరిశుభ్రత

ఏర్పేడు: స్థానిక బీసీ హాస్టల్‌లో వసతుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారు. మంగళవారం ఏర్పేడు బీసీ హాస్టల్‌ను సాక్షి ప్రతినిధి మధ్యా హ్న భోజనాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకులేనందున రోజూ పంచాయతీ మోటారు ద్వారా తాగునీరు, స్నానానికి నీటిని తొట్టెలో నింపుకుంటున్నారు. విద్యార్థుల స్నానాలకు, దుస్తులు ఉతుక్కోవడానికి నీటి కొరతతోపాటు ప్లాట్‌ఫారమ్‌లు లేవు. హాస్టల్ భవనం గదుల కిటికీలకు మెస్ ఏర్పాటు లేనందున దోమల బెడద ఉంది. ప్రహరీగోడ లేనందున లోపలికి పాములు, విష పురుగులు వచ్చే ప్రమాదం ఉంది. డ్రైనేజీలేనందున స్నానాలు, దుస్తులు ఉతికే మురుగు నీరు హాస్టల్ పరిసరాల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది.


బుచ్చినాయుడుకండ్రికలో హాస్టల్ భవనం

ఘనంగా ఆణివారి ఆస్థానం


ఆణివారి ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం సాయంత్రం ఆణివారి ఆస్థానం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు శుద్ధి, తోమాల, అర్చన, గంట, నైవేద్య సమర్పణ చేశారు. దక్షిణాయన ప్రారంభ కాలంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ మండలంలో శేషవాహనంపై ఉభయదేవరుల సమేత వెంకన్నను కొలువు దీర్చారు. ఈ సందర్భంగా టీటీడీ తరపున ఆలయాధికారులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో నిర్వహించే పద్దుల పుస్తకాలను స్వామివారి చెంత ఉంచి అర్చకులు ఆస్థానం నిర్వహించి భక్తులకు అక్షింతలు, తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యోగాలో శ్రీకాళహస్తి వాసుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న యోగా క్రీడాకారులు

శ్రీకాళహస్తి: యోగా పోటీల్లో శ్రీకాళహస్తివాసులు ప్రతిభ కనబరిచారు. కర్ణాటక స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన ఇంటర్ స్టేట్ యోగా పోటీలను నిర్వహించారు. ఇందులో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఆయిలం సుజాత ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే ఆమె నడుపుతున్న శివసాయి యోగాసెంటర్ విద్యార్థులు సోహిత, నవనీడ్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారిని నిర్వాహకులు అభినందించి జ్ఞాపికలుఅందజేశారు.

జామాయిల్ చెట్ల నరికివేత


నరికివేసిన జామాయిల్ చెట్లు

ఏర్పేడు: ఓ రైతు సాగు చేసిన జామాయిల్ చెట్లను దౌర్జన్యంగా మరో వ్యక్తి భూములు తమవంటూ మంగళవారం నరికివేసినట్లు మండలంలోని చింతలపాళేనికి చెందిన బాధితురాలు పావని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. మండలంలోని చింతలపాళేనికి చెందిన కుంభ పావని కుటుంబానికి సర్వేనంబర్లు 5–1బీలో 1.20 ఎకరాలు, 5–4ఏలో 0.93 ఎకరాల పొలాలు ఉన్నాయి. 24 ఏళ్లుగా ఆ భూములు పావని కుటుంబం స్వాధీనంలో ఉన్నాయి. ఈ క్రమంలో 10 ఏళ్లుగా పొలాల్లో జామాయిల్ చెట్లు పెంపకం చేపట్టారు. 5 ఏళ్లకు ఒకసారి చెట్లును కత్తిరించి, ఓ ప్రైవేట్ కర్మాగారానికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం చింతలపాళెం ఎస్సీ కాలనీకి చెందిన జవాది మురగయ్య, భార్య జవాది పద్మమ్మ భూములు తమవంటూ సుమారు 10 సెంట్లు భూముల్లో జామాయిల్ చెట్లును నరికివేశారు. ఇదేమిటని అడిగిన అత్త కుంభ శాంతమ్మపై దౌర్జన్యం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమారు రూ.50 వేలు ఆస్తినష్టం జరిగిందని, విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులుకు బాధిత కుటుంబం ఫిర్యాదు చేసింది.

శాస్త్రోక్తంగా ద్రౌపదీ కల్యాణం


ద్రౌపదీదేవి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ద్రౌపదీదేవి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామిని విశేషంగా అలంకరించారు. అనంతనం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

విరివిరిగా సహకార రుణాలు

బుచ్చినాయుడుకండ్రిగ: చిత్తూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా విరివిరిగా రుణాలను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు, మహిళలు, వ్యాపారులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు ప్రతినిధి రమేష్ తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలో కేంద్ర సహకార బ్యాంకు వారి ఆధ్వర్యంలో బ్యాంకు లావాదేవిలు, సైబర్ నేరాలపై కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డీసీసీబీ మేనేజర్ సాయిరాజశేఖర్, సిబ్బంది మురళీ మోహన్‌కృష్ణ, వెంకటముని, మహేష్, చంద్రయ్య, సునీత పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

ఏర్పేడు: మండలంలోని వ్యాసాశ్రమంలో సద్గురు మలయాళస్వామి రచించిన మోక్షానికి అర్హత కులమా..? గుణమా..? అనే పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరిస్తున్నట్లు సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ పుస్తకాన్ని నేటి తరానికి అనుకూలంగా ముద్రించినట్లు పేర్కొన్నారు.

జీతాలు చెల్లించాలి

రేణిగుంట: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని రేణిగుంట పాత చెక్ పోస్ట్ కూడలిలో ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్ సిబ్బంది మంగళవారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ తాము నూతనంగా నెలకొల్పిన ఈ ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నామన్నారు. ల్యాబ్‌తో పాటు ఆస్పత్రికి కావాల్సిన ఫర్నిచర్ కూడా తమతోనే ఏర్పాటు చేయించారని తెలిపారు. అన్నీ చేశాక తమకు ఉద్యోగం ఇవ్వలేదని వాపోయారు. మూడు నెలలు గడుస్తున్నా జీతాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. తాము పెట్టిన ఖర్చును కూడా చెల్లించలేదన్నారు. ఇక్కడ ఉన్న ఇన్‌చార్జులను అడిగితే పనిచేస్తే చేయండి లేదా వెళ్లిపోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

బిల్లులు చెల్లించలేదని ఆర్బీకేకు తాళం




రైతు భరోసా కేంద్రం, (ఇన్‌సెట్‌లో) తలుపులకు వేసిన తాళం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పిల్లేటివారి కండ్రిగలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనానికి అధికారులు బిల్లులు చెల్లించలేదని మంగళవారం కాంట్రాక్టర్ రాజయ్య తలుపులకు తాళం వేశారు. ఈ భవనాన్ని ఉపాధి హామీ పథకంలో రూ. 21.80 లక్షలతో ఇదే గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ రాజయ్య నిర్మించారు. ఫైనల్ బిల్లును అధికారులు చెల్లించకపోవడంతో ఆయన ఆర్బీకే భవనానికి తాళం వేశారు. త్వరలో భవనాన్ని ప్రారంభించాల్సి ఉండగా తనకు బిల్లులు చెల్లించిన తర్వాత ప్రారంభోత్సవం చేసుకోవాలని కాంట్రాక్టర్ చెబుతున్నారు. దీంతో అధికారులు భవన ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసుకున్నారు.

ముక్కంటికి పంచామృత గిన్నెలు


పంచామృత గిన్నెలను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారికి నాయుడుపేటకు చెందిన సురేష్, రమేష్ 10 పంచామృత గిన్నెలను బహూకరించారు. ఆలయ అధికారులు వాటిని స్వీకరించి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు మల్లికార్జునప్రసాద్, సుబ్రహ్మణ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని నివారిద్దాం


మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్

సత్యవేడు: అందరం కలిసి కట్టుగా కుష్టువ్యాధిని నివారిద్దామని, అందుకు అంగన్‌వాడీకార్యకర్తలు, దాసుకుప్పం పీహెచ్‌సీ సిబ్బంది చొరవ చూపాలని డాక్టర్ గుణశేఖర్ కోరారు. ఆయన ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలసి కుష్టు నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు సర్వే జరుగుతుందన్నారు. ప్రారంభ దశలోనే కుష్టువాధిని గుర్తించి సకాలంలో ఎండీటీ చికిత్స జేస్తే పూర్తిగా నయమవుతుందన్నారు. పుట్టుకతోనే ఉన్న మచ్చలు, వచ్చిపోయే మచ్చలు, పూర్తిగా తెల్లని మచ్చలు, దురద పెట్టే మచ్చలపై అపోహలు పడరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాళ పరమేశ్వరి కొలుపు ప్రారంభం




విశేషాలంకరణలో అమ్మవారు, సారె తీసుకెళుతున్న ఆలయ పెద్దలు

రేణిగుంట: మండలంలోని రామకృష్ణాపురంలో అంకాళ పరమేశ్వరి కొలుపు మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త కుంట్రపాకు మునికృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున ఆలయ పూజారి మునస్వామి, పూజారులు అమ్మవారికి విశేష అభిషేకాలు, విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామంలోని శ్రీరాములవారి దేవాలయం నుంచి అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. డప్పులు, పంబజోళ్ల, బ్యాండు వాయిద్యాల నడుమ గ్రామంలోని మహిళలు అంబళ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.